# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 01 జూన్ 2024 | పేజీలు : 04




మెయిన్‌లో...

## పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలి

### పొగాకు వాడకాన్ని నియంత్రించేందుకు

## ప్రణాళికాబద్ధంగా చర్యలు



జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకం నియంత్రించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి పొగాకు వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో పొగాకు కంట్రోల్ అంశంపై అదనపు కలెక్టర్ పి గౌతమితో కలిసి జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడారు పొగాకు వాడకాన్ని నియంత్రించేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బహిరంగ ప్రదేశాల్లో పోగ త్రాగకూడదు అనే స్పష్టమైన బోర్డులను ఏర్పాటు చేయాలని, సమీకృత జిల్లా కలెక్టరేట్ మొదలుకొని వేములవాడ ఆలయం, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులు ఆసుపత్రులు మండల కార్యాలయాలు, బస్టాండ్ , ఆలయాలు, మార్కెట్, సినిమా థియేటర్లు మొదలగు జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో జూన్ 15 నాటికి పొగాకు త్రాగకూడదు అనే బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ చివరి నాటికి జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో పొగాకు వాడకం వల్ల కలిగే కష్టాలను విద్యార్థులకు స్పష్టంగా వివరించాలని, పొగాకు ఉత్పత్తులు వాడకం వ్యతిరేకంగా వ్యాసరచన పోటీలు, వివిధ రకాల పోటీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పొగాకు ఉత్పత్తుల నిషేద చట్టం 2003పై అవగాహన కలిగి అందులోని నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, పొగాకు ఉత్పత్తుల నిషేద చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాలలో పొగ త్రాగడం, పొగాకు ఉత్పత్తులపై ప్రచారం, విద్యాలయాల చుట్టూ 100 గజముల లోపు పొగాకు సేవనం, ఉత్పత్తులపై అమ్మకం నిషేదమని,18సం.లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తుల అమ్మకం, వారిచే అమ్మించడం నిషేదమని, ఈ నిబంధనలు జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ సుమన్ మోహన్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్, డిపిఆర్ఓ. వి.శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన



కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ః అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను జగిత్యాల ఆర్బన్ మండలంలోని ధరూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను శుక్రవారం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేసే పనులను వేగవంతంగా నాణ్యతతో నిర్వహించాలని, పాఠశాలల్లో చేపడుతున్న అన్ని కాంపోనెంట్ పనులను ఒకేసారి ప్రారంభించి పనులు నిర్వహించాలని అన్నారు. పనులు నాణ్యతతో చేయించాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలపై ఉందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, పంచాయతీ రాజ్ ఈఈ రహమాన్, హౌసింగ్ డిప్యూటీ ఈఈ రాజేశ్వర్, ఎంపిడివోలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విభిన్న రకాల పత్తి విత్తనాలను వాడాలి



కరీంనగర్‌లోని ఏజెన్సీల్లో కలెక్టర్ పమేలా సత్పతి ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రైతులు విభిన్న రకాల కంపెనీల పత్తి విత్తనాలను సాగుకు వాడాలని, ఒకే రకంపై ఆధారపడవద్దని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం కరీంనగర్ లోని గాంధీరోడ్‌లో వైష్ణవి, మార్కెట్ రోడ్‌లోని రెడ్డి విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా పత్తి విత్తనాల విక్రయాలపై దుకాణ యజమానుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. దుకాణ యజమానుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రొఫార్మా ప్రకారం రైతుల వివరాలు నమోదు చేస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి విత్తనాలను నిబంధనలను ప్రకారం విక్రయించాలని సూచించారు. రైతులు ఒకే రకమైన పత్తి విత్తనాన్ని ఎక్కువగా వాడవద్దని, విభిన్న రకాలను పంటల సాగులో వాడాలని పేర్కొన్నారు. విత్తనాలు, పురుగు మందుల కొరత రాకుండా ముందు జాగ్రత్తగా ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. వ్యాపారులు నిబంధనలను పాటించాలని, లైసెన్సులను గడువు దాటక ముందే రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు. రైతులు , లైసెన్సులు కలిగిన వ్యాపారుల వద్ద విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసే సమయంలో రసీదులు తప్పకుండా తీసుకుని భద్రపరుచుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత వ్యాపారులు, వ్యవసాయ అధికారులపై ఉందని చెప్పారు. రైతులు లైసెన్సులు లేని వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, కరీంనగర్ ఏడిఏ రణధీర్ రెడ్డి, అర్బన్ వ్యవసాయ అధికారి హరిత తదితరులున్నారు.

## కూరగాయల మార్కెట్లో మౌలిక వస్తువులు ఏర్పాటు చేయాలి



ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

**ప్రజాపక్షం/వేములవాడ :**వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్‌లో నిత్యం నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను యధావిధిగా కొనసాగించాలని, దానికి కనీసం మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వంలో ఈ మార్కెట్ ఎప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఉపయోగపడే రకంగా ఇక్కడే ఉండాలని కోరుతున్నారని, పోలీస్ స్టేషన్ ముందు భాగంలో మార్కెట్ భవనం నిర్మించాము అక్కడికి పొమ్మనడం సరికాదని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్వహిస్తున్న ఈ మార్కెట్ నే కొనసాగించాలని. అక్కడికి వెళ్లే పరిస్థితి లేదు ప్రజలకు ఉపయోగపడే రకంగా ఉంటారని మార్కెట్ ఇక్కడే ఉండాలని, కానీ ఆ మార్కెట్లో వారి దగ్గర కాంట్రాక్టర్ తై బజార్ వసులు చేయడం జరుగుతుంది కానీ ఎలాంటి ఒక త్రిప్పు మట్టి పోయకుండా వర్షం కురిసిన బురదగా మారిన అలాగే వదిలేసిన పరిస్థితి గత ప్రభుత్వంలో ఎన్నో ధర్నాలు చేసినప్పటికీ సమస్యలు పరిష్కరించిన పాపాన పోలే కానీ వారు ఇన్ని రోజులుగా అక్కడ కూరగాయలు అమ్ముతూ మహిళలు ఎంతోమంది పల్లెటూర్ల నుంచి రైతులు కూడా మహిళలు వస్తా ఉన్నారు. మంచినీటీ సౌకర్యం తోపాటు బాత్రూం నిర్మించాలి వారికి మౌలిక వసతులు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వేములవాడ పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజ్, రూలర్ మండలం కార్యదర్శి సిపిఐ శ్రీరాముల నరసయ్య, కోరపు శ్రీను, రేగుల సమత, లక్ష్మి, సత్తవ్వ, అనిత,పోషవ్వ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగులు సమాజసేవలో భాగస్వాములు కావాలి

## ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమాజసేవలో భాగస్వాములు కావాలని, ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని చిగురుమామిడి ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇసాక్ ఖాన్ పదవీ విరమణ వేడుకలను శుక్రవారం మండల పరిషత్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి వినీత రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యదర్శి ఇసాక్ ఖాన్ పది సంవత్సరాలు పట్టు పరిశ్రమలో పట్టు రైతులకు ఎన్నో సేవలు అందించి గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా 23 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించడం గొప్ప విషయమన్నారు. ఎక్కడ ఎలాంటి రిమార్క్ లేకుండా ఇసాకన్ తన విధులను నిర్వర్తించారని గుర్తు చేశారు.తనకు ఎల్లవేళలా సహకరించిన వారందరికీ ఇసాక్‌ఖాన్ ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఇసాక్‌ఖాన్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపిడివో మధుసూధన్, సూపరిండెంట్ ఖాజా మొయినొద్దీన్, కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులున్నారు.

### పశుసంవర్ధకశాఖ ఏడి జయరాములు పదవీ విరమణ సన్మానం




**ప్రజాపక్షం/కరీంనగర్ :** పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాములు పదవీ విరమణ సంధర్భంగా కరీంనగర్ జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంగెం లక్ష్మణరావులు కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఇటు ఉద్యోగుల అటు ప్రజల ఆదరాభిమానాలను జయరాజు సంపాదించారని కొనియాడారు. కార్యక్రమానికి పశుసంవర్ధక శాఖ జేడి నరేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడి నల్ల లింగారెడ్డి, నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, జగన్ గౌడ్, గిరిధర్ రావు, హరిప్రియ, ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, చల్ల మోహన్ రెడ్డి, హస్మర్ రాజు, అజయ్, పోచయ్య, తిరుపతి చారి, ఉద్యోగులు, పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట మండలం కోరపల్లి గ్రా మానికి చెందిన తాటి కొండ రాజుమొగిళి గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు మృతుడి కుటుంబానికి శుక్రవారం పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకుల ద్వారా రూ.6వేల ఆర్థిక సాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్, గండి రంజిత్ కుమార్ గౌడ్, గిరవేన రాజయ్య, గిరవేన బిక్షపతి యాదవ్, తదితరులున్నారు.

# బడిబాటను విజయవంతం చేయాలి

## జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలలో జిల్లాలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బడి బాట విజయవంతం కావడానికి ఇప్పటికే కార్యచరణను రూపొందించినట్లు తెలియజేశారు. జూన్ 11 వరకు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, అదేవిధంగా జూన్ 13 నుంచి 19 వరకు ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులతో, పోషకులతో మాట్లాడి బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, డ్రాప్ ఔట్ కాకుండా చూడాలని తెలిపారు. 11వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి బడిబాట ఫలితాలపై సమీక్షించాలని సూచించారు. 12వ తేదీన పాఠశాల సంసిద్ధత దినాన్ని ఘనంగా నిర్వహించాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులకు ప్రారంభోత్సవాలు చేయాలని అన్నారు. విద్యార్థులకు యూనిఫాములు, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుకులు పంచాలని, 13 న ఫౌండేషన్ లిటరసి రోజు సందర్భంగా పాట ఆడియో ప్రదర్శించాలని, క్విజ్ ఆటల పోటీలు నిర్వహించాలని కోరారు. 14న ప్రాథమిక విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, హై స్కూల్ విద్యార్థులకు బాలసభ నిర్వహించాలని, 15న సమగ్రత విద్యా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పాలని పేర్కొన్నారు. 18న తరగతి గదిలో డి డిజిటలైజేషన్ పై అవగాహన, చెట్ల పెంపక దినోత్సవం నిర్వహించాలని అన్నారు. 19న క్రీడా దినోత్సవం నిర్వహించి వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ కటకం మధుకర్ మరియు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉద్యోగికి పదవి విరమణ అనివార్యం

## జిల్లా అడిషనల్ ఎస్‌పి ప్రభాకర్ రావు



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ ప్రతినిధి :** ఉద్యోగరీత్యా ఎవరికైనా పదవి విరమణ అన్నది అనివార్యమని జిల్లా అడిషనల్ ఎస్‌పి ప్రభాకర్ అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లోని కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఫారిద్ పదవి విరమణ సందర్భంగా శుక్రవారం రోజు జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా పోలీస్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్‌పి ప్రభాకర్ రావు (అడ్మిన్) పాల్గొని పదవి విరమణ పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ షేక్ ఫారిద్‌ని శాలువాతో సత్కరించి మెమెంటో ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వర్తించి, ఎలాంటి రిమార్క్ లేకుండా పదవి విరమణ చేయడం గొప్ప విషయం అని తెలిపారు. ప్రజా రక్షణ కోసం తమ ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయక పోలీసులు పనిచేస్తారని, షేక్ ఫారిద్ పోలీస్ శాఖకు చేసిన సేవలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే పోలీస్ శాఖలో పని చేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఆర్‌హెడ్ క్వార్టర్స్ ఆర్‌ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీస్ సంఘం సభ్యులు ఎంవిఎస్ రెడ్డి, స్వామి, దేవాజి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలి



**ప్రజాపక్షం /సిర్పూర్ టి :** చదువు మానేసిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బడి బాట కార్యక్రమం చేపట్టిందని తహసీల్దార్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. సిర్పూర్ టి మండల కేంద్రంలో శుక్రవారం బడి బాట కార్యక్రమంపై సమీక్ష సమావేశం ఆదర్శ మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశములో తహశీల్దార్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో చదువు పూర్తి చేసిన బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ బడులలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. పిల్లలను బడులలో చేర్పించుటకు మహిళా సంఘాలు కృషి చెయ్యాలని, అంగన్ వాడి కేంద్రాలలో చేరి ప్రస్తుతము బడిలో చేరే పిల్లల వివరాలు తెలియజేయాలని, ప్రభుత్వ బడులలో చేర్పించడం వలన పిల్లలకూ కలిగే లాభాలు తల్లితండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఈ నెల 3వ తేదీన ప్రారంభయ్యే బడి బాట ర్యాలీలు గ్రామ సంఘం ఆధ్వర్యములో గ్రామ సభల ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఒ పి. సత్య నారాయణ, ఎంపిఒ కృష్ణ మూర్తి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ పద్మ, ఎపిఎం దుర్గయ్య, సిఆర్‌పి పవన్, ఆదర్శ మండల సమాఖ్య అధ్యక్షులు, సిసిలు, విఒఎలు, గ్రామ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/మంచిర్యాల: జిల్లాలో దోస్త్ ప్రకటనతో డిగ్రీ అడ్మిషన్లలో భాగంగా అక్రమాలకు తెరతీస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని టివియువి రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు గాను దోస్తు ప్రకటన వెలువడిన నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ, స్వతహాగా తనంతట తాను చేరాల్సిన విద్యార్థిని యాజమాన్యాలు మాయ మాటలతో తమ తమ కళాశాలల్లో చేర్పించుకుంటున్నారని ఇది ఉన్నత విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధం అని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యాలు తమ పద్ధతి మార్చుకొని విద్యార్థి స్వేచ్ఛగా నచ్చిన కళాశాలలో చదువుకొనే వాతావరణం కల్పించాలని, లేని యెడల సదరు కళాశాలల పై యూనివర్సిటీ అధికారులకు, ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# పొగాకు వాడకాన్ని నిర్మూలించాలి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** పొగాకు వాడకాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం బట్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించిన వారికి ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు సంభవిస్తాయని, అనారోగ్యం బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పొగ త్రాగే వారికే కాకుండా వారి వద్ద ఉన్న వారికి కూడా ఆరోగ్యం చెడిపోతోందని వెల్లడించారు. వైద్య సిబ్బంది గ్రామాలలో పొగాకు వాడటం వలన కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ వినోద్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ రషీద్, సూపర్వైజర్లు సరిత, ప్రమీల, గోవర్ధన్, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ రూరల్ :** రైతులు నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని, విడి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని ఎఇఒ యువరాణి సూచించారు. కాగజ్ నగర్ మండలంలోని జగన్నాథ్ పూర్ గ్రామంలో శుక్రవారం రైతులకు సాగు విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విడి విత్తనాలు, కాలం చెల్లిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేయరాదని, దుకాణం నుంచి కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదులను తప్పనిసరి తీసుకోవాలన్నారు. పంటకాలం ముగిసేవరకు విత్తనాల ప్యాకెట్, రశీదును భద్రపరిచి ఉంచాలని వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన దుకాణాలలోనే కొనుగోళ్లు చేయాలని సూచించారు. అనంతరం జీలుగు సాగు చెయ్యడం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి

## ఎస్‌సి కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్



**ప్రజాపక్షం / హుజూరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి కానుండడంతో బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఆదేశాల మేరకు దశాబ్ది ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామని, ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ బిఆర్ఎస్ కార్యకర్తలతో పాటు నాయకులకు పిలుపునిచ్చారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఆయన స్వగృహంలో మాట్లాడారు. శనివారం హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ మొదలై అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు పెద్ద ఎత్తున నివాళి అర్పించనున్నట్లు తెలిపారు. అలాగే ఆదివారం బిఆర్ఎస్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పది సంవత్సరాల్లో బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి చేసిన అన్ని కార్యక్రమాలను ఉద్దేశించి తెలంగాణ తొలి సియం కేసిఆర్ ప్రసంగించనున్నారని ఆయన అన్నారు. దీంతో పాటు మూడో తేదీన అన్ని జిల్లాల్లో సామాజిక కార్యక్రమాలతో పాటు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. దశాబ్ది ఉత్సవాలను నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున జరుపుకోవాలని కోరారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/నర్సాపూర్(జి) :** మండలంలోని మైనింగ్ శాఖ అధికారి ఆనంద్,ఆర్ఐ సుమలత ఆధ్వర్యంలో అక్రమంగా రావణ చేస్తున్న ఇసుకను అడ్డుకున్నారు.చాక్ పల్లి గ్రామంలో అక్రమ ఇసుక రవాణా చేయకూడదని,అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా.పెడచెవిన పెడుతూ నిర్భయంగా ఇసుక రవాణా జరుగుతున్నదని,తెలుసుకున్న ఆర్ఐ సుమలత శుక్రవారం ట్రాక్టర్లను పట్టుకోవడం తో ఇసుక మాఫియా ఆక్రమణ బయటపడ్డాయి.అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా దర్జాగా ఇసుక రవాణా జరగడం వెనుక ఉన్న మాఫియా ని పట్టుకోక పోవడంతో ఈ తతంగం నడుస్తుందని అధికారులు లోతుగా విచారించి కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.అక్రమ ఇసుక రవాణా చేస్తూ పోలీస్ మండల మైనింగ్ సిబ్బందితో మంట



కాగుతున్న ఇసుక మాఫియా పై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్రంగా భూగర్భ జలాలు అలమటించి భావితరాలకు నష్టం వాటిలుతుందని మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండల స్థాయిలో అధికారులు సైతం ఫిర్యాదులు వెళ్లిన ఎలాంటి భయం లేకుండా అక్రమ ఇసుక రవాణా జరుగుతుండడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.గతంలో కూడా ఇసుక డంపులు పట్టుబడ్డ ఆ ఇసుక డంపు వేసిన వారికే ఇసుక టెండర్ దక్కడం లాంటివి జరగడంతో అధికారుల పట్ల భయం తొలగిపోయి దర్జాగా ఇసుక మాఫియా నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలం చాక్‌పల్లి గ్రామం వేదికగా అక్రమ రవాణా చస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.ఈ ఇసుక తంతంగం పై పూరిస్థాయి విచారణ జరిపేంత వరకు సహజ వనరులు దోపిడీకి గురవుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గొంగడి కురుమల సాంప్రదాయ వస్త్రం



**ప్రజాపక్షం/చందుర్తి :** కురుమల సాంప్రదాయక వస్త్రం గొంగడికి యునెస్కో గుర్తింపు లభించడం హర్షనీయమని జోగాపూర్ ఎంపీటీసీ మేకల గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల 21వ శతాబ్దం కోసం తయారుచేసిన చేనేత వస్త్రలు సంప్రదాయ భారతీయ వస్త్రల సంరక్షణ పేరుతో యునెస్కో విడుదల చేసిన నివేదికలో తెలుగు రాష్ట్రాల నుంచి మూడింటికి చోటు దక్కిగ అందులో కురుమ గొంగడికి చోటు దక్కడం చాలా సంతోషకరం అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా గొంగడికి సరైన గుర్తింపు దక్కేలా కురుమల ను ప్రోత్సహించాలని కోరారు. నలుపు, తెలుపు గొర్రెల ఉన్నితో నేసే గొంగళ్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ల్లోని కురుమ ఇళ్లలో చలికాలం వెచ్చగా, ఎండాకాలం చల్లగా, అడవుల్లో గొర్రెలు మేత మేసే సమయాన వర్షాకాలం తడవకుండా ఉపయోగపడుతూ కురుమల జీవితంలో అంతర్భాగంగా మారాయని అన్నారు. ప్రస్తుతం సాంప్రదాయ గొర్రెల పెంపకం తగ్గించి మాంసం ఎక్కువ ఇచ్చే జాతులను పెంచుతుండటం వల్ల ఉన్ని ఉత్పత్తి తగ్గిపోయిందని యునెస్కో విశ్లేషించిందని గుర్తు చేశారు. సాంప్రదాయ గొర్రెల పెంపకానికి చేయూత నివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కులవృత్తులను కాపాడండి..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఆనాధిగా వస్తున్న బైండ్ల కులవృత్తులను కాపాడండని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్‌కు బైండ్ల కులస్థులు విన్నవించుకున్నారు.శుక్రవారం జిల్లాలోని సిరిసిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూరం గ్రామంలో తమ కులవృత్తులను కాపాడాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ ను కలిశారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మూడనమ్మకాలను నమ్మవద్దని వాటిని ప్రోత్సహించరాదని పోలీసులు హెచ్చరికలు చేశారు. జిల్లాలో ఏకకాలంలో విస్తృత సోదాలలో పలు యంత్రాలు,తాయత్తులు కనిపించాయని నిందుతులపై ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అణగారిన వర్గాలపై సానుకూలంగా స్పందించాలని పోలీసులకు సూచించినట్లుగా బైండ్ల కులస్థుల విస్వసనీయ సమాచారం.అనాధిగా వస్తున్న మా ఆచార వ్యవహారాలు,పండుగలు చేస్తుంటామని ఎవరివద్ద బలవంతపు వసూళ్లు ఉండవని తమ గోడును వెళ్ళగక్కారు, కార్యక్రమంలో గొట్టె వెంకట్రాములు,బైండ్ల రామస్వామి, గొట్టెసురెందర్, శ్రీనివాస్ ఉన్నారు.

## మహానీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** దేశం కోసం సర్వస్వాన్ని అర్పించిన మహానీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర ప్రతినిధి ఆకుతోట వెంకటరమణారెడ్డి అన్నారు. గౌతమ బుద్ధుడు, వీరసావర్కర్, భాగ్యరెడ్డి వర్మ, రాణి అహల్యభాయ హోల్కర్‌ల జయంతి ఉత్సవాలను శుక్రవారం స్థానిక గీతా గ్రంథాలయంలో నిర్వహించారు. సామాజిక సమరసతా వేదిక జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహానీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ దేశ సంస్కృతి, సాంప్రదాయాల



పరిరక్షణ, స్వాతంత్ర్య సాధన కోసం కృషి చేసిన మహానీయుల అడుగు జాడల్లో నడిచి వారి ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు కనికరం లచ్చన్న, కార్యదర్శులు భూమారెడ్డి, సూర్యనారాయణ, మదన్ మోహన్, కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు వాడకం ప్రమాదకరం...

**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** జగిత్యాల జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఉప వైద్యాధికారి నీలారపు శ్రీనివాస్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల చాలా ఆనర్థాలు వస్తాయని, క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ ఇంకా అనేక రకాల భయంకర వ్యాధులు సోకుతాయని అన్నారు. పొగాకు గురించి 1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ పొగాకు వాడకంపై నిర్వహించిన సమావేశంలో 1988 ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపునిచ్చారని, ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 7వ తేదినా 24గంటల పాటు వినియోగదారులు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరారని అన్నారు. 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని డబ్ల్యుహెచ్‌వో ప్రకటించారని అన్నారు. అనేక కార్యక్రమాలు డిజిటల్ సాధనాల ద్వారా 100 మిలియన్ల మంది ప్రజలు పొగాకు వాడకాన్ని విడిచిపెట్టడంతో సహాయపడటం ఈ ప్రచారం యొక్క లక్ష్యం. ప్రస్తుతం, 23 దేశాలు మాత్రమే పొగాకు వినియోగదారులను విడిచిపెట్టడానికి పూర్తి సేవలు అందిస్తున్నాయని అన్నారు. ఈ పొగాకు వ్యతిరేక ర్యాలీ కార్యక్రమంలో ప్రోగాం ఆఫీసర్ వైద్యులు సమియోద్దిన్, ఆకుల శ్రీనివాస్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్ మిత్రుల ధాతృత్వం..




**ప్రజాపక్షం/ధర్మపురి :** నాలుగు నెలల క్రితం జాతీయ రహాదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయి మంచానికే పరిమితమైన బాధితుడికి ఫేస్‌బుక్ మిత్రులు స్పందించి రూ.లు 1.40లక్షలు సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మపురి మండలం నేరేళ్ల గ్రామానికి చెందిన అక్కనపల్లి బాబు కుమార్ చాలీచాలని ఆదాయంతో భార్య, ఇద్దరు కుమారులను పోషిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం బాబు కుమార్ జగిత్యాల నుండి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగి ఎడమ కాలును కోల్పోయాడు. దాంతో తన చిన్ననాటి మిత్రులు అందించిన సహాయంతో వైద్యం జరిగింది. తదుపరి వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. బాధితుడి దీన స్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్పందించి బాబు కుమార్ కుటుంబానికి సాయం అందించాలని కోరుతూ మే 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. అందుకు స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, ఇతర దాతలు బాబు కుమార్ భార్య రాణి బ్యాంక్ ఖాతాలో రూ.లు 1.40 లక్షలు జమ చేశారు. దాతలు పంపించిన విరాళాలతో రాణి పేరుతో రూ.లు 50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు, ప్రస్తుత వైద్య ఖర్చుల కోసం రూ.లు 20వేలు నగదును ఎస్‌బిఐ అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ సంతోష్ చేతుల మీదుగా పంపిణీ చేయించాడు. మిగతా డబ్బులు కుటుంబ అవసరాల కోసం ఆమె యొక్క సేవింగ్ ఖాతాలో నిల్వ ఉంచడం జరిగిందని రమేష్ తెలిపాడు.

## కొండగట్టు అంజన్న క్షేత్రంలో ప్రభుత్వ విప్ పూజలు

**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** జగిత్యాల జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న క్షేత్రంలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## శ్రీ కోటేశ్వర స్వామి దేవాలయంలో వేలం పాట



**ప్రజాపక్షం / వెల్గటూర్ :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో గల శ్రీ కోటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం రోజున బహిరంగ వేలం పాట నిర్వహించారు. కొబ్బరి కాయలు పూజ సామాగ్రి అమ్ముకునే హక్కును మంచికట్ల విజయ రూ.లు 8,10,000/, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కును నక్క రమాదేవి రూ.లు 65,000/, లడ్డు, పులిహోరా అమ్ముకునే హక్కును మొగిలిపాలెం నాగరాజు రూ.లు 2,30,000/లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రవి కిషన్, ఈవో కాంతా రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది, నాయకులు పర్శ కోటయ్య, నక్క రవితేజ, మూగల సత్యం గ్రామస్థులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీవో



**ప్రజాపక్షం/ ముత్తారం :** ముత్తారం తాసిల్దార్ కార్యాలయాన్ని మంథని ఆర్డిఓ హనుమాన్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆర్డీవో శుక్రవారం హనుమాన్ నాయక్ మాట్లాడుతూధరణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని మంథని రెవెన్యూ డివిజినల్ అధికారి వి.హనుమ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్‌కార్యాలయములో ధరణి పై సమీక్ష నిర్వహించినారు.ముత్తారం మండల వ్యాప్తంగా 32 దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం ధరణి నందు చేసిన మార్పులలో భాగంగా ఆర్డీవో కి అనుసంధానం చేసిన వివిధ మాడ్యుల్ ల దరఖాస్తులను పరిశీలించారు. కుల,నివాస, ఆదాయ దృవీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు జారీ చేయాలనీ, అక్రమ మైనింగ్ పై నిఘా పెట్టాలని సూచించినారు. తహశీల్దార్ పి.సుమన్, సీనియర్ సహాయకులు,ఇంచార్జి గిర్దావర్ ఎ.భవానీ ప్రసాద్, గిర్దావర్.శ్రీధర్, జూనియర్ సహాయకులు మదన్ మోహన్ తోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సహకార సంఘాల ఎన్నికల కోసం ప్రతిపాదనలు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి సమర్పించాలి

### జిల్లా సహకార అధికారి శ్రీమాల

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** సహకార సంఘాల ఎన్నికల కోసం ప్రతిపాదనలు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి సమర్పించాలని జిల్లా సహకార అధికారి శ్రీ మాల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 7 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు, 3 లేబర్ కాంట్రాక్టర్ సహకార సంఘాలకు ఎన్నికలను తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ జూన్ 6 నుంచి 28 మధ్యలో నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల కాలపరిమితి ముగియబోయే ఇతర సహకార సంఘాలు, వారి యొక్క సంబంధిత ఫంక్షన్ రిజిస్ట్రార్లు, వారి యొక్క సంఘాల ఎన్నికల ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ హైదరాబాద్ వారికి సమర్పించాలని పేర్కొన్నారు.

# పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నివారించాలి

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్




ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : మన ఆరోగ్యానికి తీవ్రంగా హానికరమైన పొగాకు వాడకాన్ని నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ పొగాకు వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.పెద్దపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రంగంపల్లి మీదుగా కమాన్ వరకు, కమాన్ నుంచి మళ్లీ పెద్దపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం పొగాకు వ్యతిరేక దినోత్సవం థీమ్ అయిన పొగాకు సంస్థల జోక్యం నుండి పిల్లలను రక్షించడం దిశగా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న సమస్యల్లో ఒకటి ధూమపానం, పొగాకు వాడకమని అన్నారు. ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు మరెన్నో కారణంగా చాలా మంది ఈ అలవాటును ఎంచుకుంటారని,ఎవరైనా సిగరెట్ తాగినప్పుడు, వారు తమను తాము మాత్రమే కాకుండా చుట్టుపక్కల వారందరికీ హాని చేస్తారని అన్నారు .పొగాకు వాడకం మానవ శరీరంపై అనేక దుష్ప్రభావాలను చూపుతుందని తెలిపారు.పొగాకు ఉత్పత్తుల నిషేద చట్టం పై అవగాహన కలిగి అందులోని నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, పొగాకు ఉత్పత్తుల నిషేద చట్టాల ప్రకారం బహిరంగ ప్రదేశాలలో పొగాకు సేవించడం నిషేధమని అతిక్రమించిన వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే బడుతుందని అన్నారు.విద్యాలయాల చుట్టూ 100 గజముల లోపు పొగాకు సేవనం, ఉత్పత్తులపై అమ్మకం నిషేదమని, అతిక్రమించిన వారిని జరిమానా,18 సంవత్సరాలలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తుల అమ్మకం, వారిచే అమ్మించడం నిషేదం అని, ప్రతి పొగాకు ఉత్పత్తులపై నిర్ణీత ఆరోగ్య హెచ్చరికలు ఉండవలెననీ, పొగాకు ఉత్పత్తు లో గల నికోటిన్ దాని మోతాదు సూచించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. పొగాకు ఉత్పత్తులు ధూమపానం ద్వారా గాని లేదా నోటి ద్వారా గాని ఏ విధంగా సేవించిన ప్రమాదకరం వీటి వలన క్యాన్సర్ వ్యాదికి గురి అయ్యే అవకాశం ఎక్కువని, అందుకే మన జిల్లా ప్రజలకు పొగాకు వాడకం వలన కలిగే నష్టాలను అర్థం చేసుకొని పొగాకు వాడటం అలవాటు ఉన్నవారు, పొగాకు మానేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.అనంతరం వైద్యారోగ్య సిబ్బందిచే పొగాకు ఉపయోగించం అని, పొగాకు వాడకాన్ని నిరోదించుటకు ప్రేరేపిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమములో ప్రోగ్రామ్ అదికారి (ఎన్.సి.డి)డా. ఆర్. రాజమౌళి, జిల్లా కన్వీనర్ (ఐ.ఆర్.సి.ఎస్) కావేటి రాజగోపాల్, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డా. శ్రవణ్, డా. మమత,డా.స్వప్న, యం.ఎల్.హెచ్.పి.లు, డా.అభినయ్, డా. కీర్తన, డా. స్వాతి, యస్. వెంకటేశ్వర్లు, డిప్యూటి డెమో టి. రాజేశం, తిరుపతి రెడ్డి, ఎన్.సి.డి. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లు, శ్రీ యం. సాంబయ్య, యం.పి.హెచ్.ఇ.ఓ లు రాగినేడు, రాఘవాపూర్ యం.ఎల్.హెచ్.పి.లు, సూపర్ వైజర్ లు, ఎఎన్ఎమ్ లు ఆశలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలి

ప్రజాపక్షం/రామగిరి : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగాప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య తో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని కావున ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని ఇన్చార్జి ఎంఈఓ సురేందర్ అన్నారు. శుక్రవారం రామగిరిమండలంలోనిమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బడిబాట కార్యక్రమం పై స్కూల్ హెచ్ ఎం ఎస్, గ్రామ వివో లు, ఏ ఏ పీ సి చైర్ పర్సన్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3 నుండి 19 వరకు బడి బాట, ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు రియంబర్స్మెంట్ సదుపాయాలతో పాటు తదితర సౌకర్యాలు ఉంటాయని గ్రామాలలో ప్రతి ఒక్కరు ఇంటింటికి తిరుగుతూప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ రాణి, తాసిల్దార్ రామచంద్రరావు, ఏపీఎం స్వరూప తదితరులున్నారు.

## మరోభారీ అగ్ని ప్రమాదం.. దగ్ధమైన ఈత వనం



ప్రజాపక్షం/బుగ్గారం: బుగ్గారం మండల కేంద్రంలో మరో అగ్ని ప్రమాదం సంభవించింది మండల కేంద్రంలోని అల్లకుంట్ల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు 300 వరకు ఈత వనం దగ్ధమైంది. అలాగే రైతుల కరెంట్ మోటార్లు ధ్వంసం అయ్యాయి. ఈతవనం దగ్ధమైన గీతా కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండి ఆదుకోవాలని బుగ్గారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నష్టపోయిన వారు ఇల్లందుల శ్రీనివాస్, ఇల్లందుల అంజన్న, నగునూరు శ్రీనివాస్, అన్నపురం శ్రీనివాస్ న్యాయం చేయాలని కోరుతున్నారు. జరుగుతున్న ఈ అగ్ని ప్రమాదాలపై చర్యలు చేపట్టాలన్నారు.

## క్రీడల వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/వేములవాడ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో జూన్ 5 నుంచి 7 వరకు జరిగే ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ కు ఎంపికైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులను సాగనంపెందుకు వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం లో శుక్రవారం ఉదయం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు నేటి యువత చేతిలో ఉందని చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, జిల్లాలో మాస్టర్ అథ్లెట్స్ అంతర్జాతీయ క్రీడల్లో పాలు పంచుకోవడం అభినందనీయం. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి. యువత చదువుతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలని, క్రీడల్లో ప్రతి ఒక్కరు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, అదే స్ఫూర్తి ని నిజ జీవితంలో అలవర్చుకుంటు ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. క్రీడలలో పాల్గొనడం వల్ల శారీరకంగా,ఆరోగ్యం గా దృడంగా ఉండడంతో పాటు మానసికంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారని అన్నారు.నిజ జీవితంలో సమిష్టి కృషి తోనే విజయాలను సులువుగా చేరుకోగలమనే దానికి ఉదాహరణ క్రీడలని అన్నారు. క్రీడ ఓటమి చెందిన వారు తమ లోపాలను సవరించుకొని ముందుకు వెళ్లడం అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ , అన్నారం శ్రీనివాస్, క్రీడాకారులు రాజన్న సిరిసిల్ల జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ కార్యదర్శి జి.శేఖర్, జాయింట్ సెక్రెటరీ చింతలపల్లి మునిందర్ రెడ్డి, పెద్దపల్లి కార్యదర్శి కె.మహేందర్ రెడ్డి, అథ్లెట్స్ కమఠం రామానుజమ్మ, నాయిని శంకర్, అబ్దుల్, పఠాన్, లక్ష్మణ్ , కమల్, జవ్వాజి, లక్ష్మణ్ లు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జర్నలిస్టులను గుర్తించాలి..



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పటు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన జర్నలిస్టులను జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో గుర్తించాలని టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు కొండూరి రవీందర్,వెంకగారి భూమయ్య శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర కోసం చేసిన ఉద్యమాలను ప్రపంచ నలుమూలలకు తెలిసేలా ఎంతో కృషి చేసింది జర్నలిస్టులు మాత్రమేనని అన్నారు.ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు,వ్యాపారస్తులు,కవులు,కళాకారులు,విద్యార్థులు,రచయితలు ఇలా సబ్బండ వర్గాల వారు చేసిన ఉద్యమాలను చూసి ఆనాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించడం వెనుక జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అన్ని జర్నలిస్టు సంఘాల వారు ప్రత్యేక్షంగా,పరోక్షంగా ఉద్యమాలలో పాల్గొని రాష్ట్ర సిద్ధించడానికి ప్రధాన కారకులైన సంగతి ప్రస్తుత ప్రభుత్వాలు మర్చిపోవద్దని అన్నారు. అదేవిధంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏండ్లు అయినప్పటికి రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టుల బతుకులు )మాత్రం ఏమీ మారలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ఐచర్ పట్టివేత..



ప్రజాపక్షం/తానూర్:: ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా మహారాష్ట్ర ధర్మబాద్ నుండి తానూర్ మండలానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ఐచర్,లోడును శుక్రవారం మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై లోకం సందీప్ తెలిపారు.అనంతరం పట్టుకున్న ఇసుక ఐచర్ను,తదుపరి చర్యలకు తాసిల్దార్ లింగమూర్తికి పంపించగా 25 వేల రూపాయలు జురుమాన విధించినట్లు ఎస్సై లోకం సందీప్ తెలిపారు.ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ లోకం సందీప్ తెలిపారు.

## పమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతి



ప్రజాపక్షం /రామగిరి: రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన కుంట మొండయ్య(75)సంవత్సరాలు అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలు జారి వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మరియు రామగిరి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం 30 తేదీరోజున ఇంటి వద్ద నుండి కల్వచర్ల గ్రామ శివారులో గల తన పొలం వద్దకు వెళ్ళు క్రమంలో దాహం వేయగా వేణు సాగు చేస్తున్న వ్యవసాయ భూమిలో గల బావిలో నీరు త్రాగుటకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోగా ఈతరాక మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు కుంట ఓదేలు, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

## బడిబాటను విజయవంతం చేద్దాం: మండల ప్రత్యేక అధికారి నర్సయ్య



ప్రజాపక్షం/దిల్వార్పూర్: ఈనెల జూన్ 3న ప్రారంభం కానున్న బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్యేక అధికారి నరసయ్య,ఎంపిడిఓ అరుణ రాణి అన్నారు.శుక్రవారం దిలావర్పూర్ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బడిబాట కార్యక్రమానికి సంబంధించిన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పుష్ప,ఎస్సై సుమంజాలి,ఎంపీ ఓ అజీజ్ ఖాన్,కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సదానంద్,ఏఓ, డి.స్రవంతి,మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## నువ్వు పంట చోరీ..



ప్రజాపక్షం/సోన్: ఎంతో కష్టపడి పండించిన పంటను చూసి మరిసి పోయిన రైతు,కాని ఈ రైతుకు కన్నీళ్లే మిగిలిన సంఘటన శుక్రవారం సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన పుట్టకొక్కుల ప్రశాంత్ రైతు తన ఎకరం భూమిలో నువ్వు పంట సాగు చేశారు.నాలుగు రోజుల క్రితం పంటకోసి ఎండబెట్టాడు,గురువారం గుర్తుతెలియని వ్యక్తులు ఎండిన నువ్వును ఎత్తుకెళ్లారు.శుక్రవారం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన రైతు పంట దొంగతనానికి గురైందని విస్తుపోయాడు.సుమారు రూ.90వేల విలువైన ఏడు క్వింటాళ్ల నువ్వు పంట చోరికి జరిగిందని బాధితుడు వాపోయి పోలీసులను ఆశ్రయించాడు.

## బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి...



ప్రజాపక్షం/కుంటాల: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం కుంటాల మండలం కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలని.ఈ జూన్ 3 నుండి 19 వరకు ప్రతిరోజు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించి పిల్లలకి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారికి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రతి పిల్లాడికి మధ్యాహ్నం భోజనం వంటి వాటితో పిల్లల యొక్క మానసిక,శరీరక ఎదుగుదలలో ఎలాంటి రుగ్మతలు లేకుండా చూడడంఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎజాజ్,ఎంపీడీవో అబ్దుల్ రహీం,ఏపీఎం అశోక్,ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి విశారాధ తదితరులు పాల్గొన్నారు.